క్లుప్తంగా

రామాలయానికి పలువురు భక్తుల విరాళం



పెనమలూరు: పోరంకి శ్రీ సీతాలక్ష్మణ ఆంజనేయ సమేత శ్రీ కోదండ రామస్వామివారి ఆలయానికి దాతలు విరాళాలు ఇచ్చారు. గ్రామానికి చెందిన వీర్ల సుబ్బారావు, నాగలక్ష్మి దంపతులు స్వామివారి ఆలయానికి రూ.1,00,116 లక్షలు విరాళంగా గురువారం ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ధ్వజ స్తంభం తొడుగుకు చెక్క రామకృష్ణ రూ.2.50 లక్షలు, తోటకూర సాంబశివరావు, నాగ మల్లేశ్వరి రూ.1,01,116 లక్షలు విరాళంగా ఇచ్చారు.

ఘనంగా శ్రీ కోదండరామ స్వామి దివ్య విగ్రహ ప్రతిష్ట



పెనమలూరు: పోరంకి గ్రామంలో గురువారం శ్రీసీతాలక్ష్మణ ఆంజనేయ శ్రీకోదండరామస్వామివారి దివ్య విగ్రహ ప్రతిష్టా మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. దాతల సాయంలో శ్రీ రామాలయాన్ని పునః ప్రతిష్ట చేశారు. ఈ సందర్భంగా ఈ నెల 9వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం ఆలయంలో విగ్రహ ప్రతిష్టలో భాగంగా జయ విజయ ద్వారపాలకులు, శిఖర ప్రతిష్ట, ధ్వజస్తంభ ప్రతిష్ట చేశారు. భక్తులు భారీగా రావటంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఎటువంటి ఘటనలు జరగకుండా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అనంతరం స్వామివారి కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. దాదాపు 20 వేల మంది భక్తులకు అన్నసమారాధన చేశారు.

చిన్నారుల సమగ్ర అభివృద్ధి లక్ష్యం



కంకిపాడు: చిన్నారుల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలని ఐసీడీఎస్ కంకిపాడు ప్రాజెక్టు సీడీపీఓ కె.బేబీ సుకన్య అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పోషణ్ బీ పఢాయి బీ కార్యక్రమం కింద మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. సీడీపీఓ బేబీ సుకన్య మాట్లాడుతూ అక్షరాస్యత వృద్ధి, ఆరోగ్య పరిరక్షణ చాలా ముఖ్యమన్నారు. తొలి రోజు కంకిపాడు మండలంలోని 45 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎస్.అన్నామణి, శ్రీలత పాల్గొన్నారు.

ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

కంకిపాడు: రైతులు ఫార్మర్ ఐడీలో తమ వివరాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి పీఎం కిరణ్ అన్నారు. మండలంలోని మంతెన, జగన్నాధపురం గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మినుము పైరును పరిశీలించి రైతులు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఏఓ పిఎం కిరణ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్ పనులు చేపట్టామన్నారు. రైతులు తమ గ్రామాల్లోని రైతు సేవా కేంద్రంలో తమ వివరాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం నకళ్లతో ఆధార్ అనుసంధాన ఫోన్ నంబరుతో రిజిస్ట్రేషన్ చేయించుకుంటే ప్రయోజనాలు చేకూరుతాయని వివరించారు.

సెంట్రల్ జోన్ పోటీల్లో విజేతలుగా సాయి శ్రీనివాస విద్యార్థులు

ఉంగుటూరు: కృష్ణాజిల్లా సెంట్రల్‌జోన్ పోటీలలో శ్రీసాయి శ్రీనివాస హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ సాయిబాబా తెలిపారు. స్థానిక పాఠశాలలో గురువారం విజేతలకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవనిగడ్డలో ఈనెల 11, 12 తేదీల్లో జరిగిన కృష్ణాజిల్లా 84వ గ్రిగ్ మెమోరియల్ సెంట్రల్ జోన్ పోటీల్లో తమ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న బి.ప్రశాంతి, ఎన్.దీపిక ఉత్తమ ప్రతిభ కనబరచి విజేతలుగా నిలిచారని చెప్పారు. క్రీడాకారులకు తర్ఫీదు నిచ్చిన పీఈటీ కొడాలి గాంధీని, విజేతలను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.


అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

నున్న(విజయవాడరూరల్): నున్న జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విజయవాడ రూరల్ మండలంలోని 50 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషన్ బీ, పఢాయి బీపై మూడు రోజులపాటు జరిగే శిక్షణ కార్యక్రమాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జొన్నలగడ్డ కవిత, సీహెచ్.శ్యామలత అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

పట్టించుకునే నాథుడేరీ?

- చిట్టడవిని తలపించే పరిసరాలు
- అధ్వానంగా రహదారులు
- పంచాయతీకి అప్పగించరూ.. ?
- వీఎంసీ పట్టించుకోదు ?

వీఎంసీ లే అవుట్‌లో కనీస వసతులు కరువు



వణుకూరు గ్రామంలోని వీఎంసీ లే అవుట్ ఓవరాల్ వ్యూ



వీఎంసీ లే అవుట్ ముఖ ద్వారం

కంకిపాడు: చిట్టడవిని తలపించే పరిసరాలు.. అధ్వానంగా అంతర్గత రహదారులు.. చినుకు పడితే చిత్తడిగా మారి రాకపోకలకు అవస్థలు... వీఎంసీ వసతులు కల్పించి పంచాయతీకి అప్పగించదు?.. పంచాయతీ ఏ వసతులు కల్పించలేని దుస్థితి. వెరసి పట్టించుకునే నాథుడే కరువై వణుకూరు గ్రామంలోని వీఎంసీ లేఅవుట్ వాసులు అసౌకర్యాలతో సహవాసం సాగిస్తూ నానా అగచాట్లు పడుతున్నారు.

5,440 మందికి నివేశన స్థలాల కేటాయింపు

ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలకు నివేశన స్థలాలు అందించే లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు అందించింది. ముఖ్యంగా విజయవాడ నగర పరిసరాల్లో పేదల నివేశన స్థలాల సమస్యను పరిష్కరించేందుకు గ్రామీణ ప్రాంతాల్లో భూసేకరణ చేసి స్థలాలు అప్పగించింది. ఇందులో భాగంగానే పెనమలూరు మండలం వణుకూరు గ్రామంలో ఏనుగుల కోడుకు ఆనుకుని వీఎంసీ లే అవుట్‌ను ఏర్పాటు చేసింది. 5,440 మంది నిరుపేదలకు స్థలాలు కేటాయించింది. పటమట, కృష్ణలంక, పకీరుగూడెం, గిరిపురం మొగల్రాజపురం, క్రీస్తురాజపురం, లబ్బీపేట పరిసరాలకు చెందిన పేదలకు ఒక్కొక్కరికి సెంటు చొప్పున ఇక్కడ స్థలాలు అందజేశారు. 1,550కి పైగా గృహ నిర్మాణాలు పూర్తికాగా, 1400 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయి. ప్రస్తుతం 100 మందికి పైగా కుటుంబాలు ఏడాదికి పైగా ఇక్కడికి వచ్చి జీవనం సాగిస్తున్నాయి.

కానరాని వసతులు..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే ఈ లేఅవుట్‌లో ప్రధాన రహదారి, అంతర్గత రహదారుల నిర్మాణాలు జరిగాయి. రబ్బిస్‌తో రహదారుల అభివృద్ధి జరిగింది. లేఅవుట్‌లోని అన్ని ప్రాంతాలకూ విద్యుదీకరణ కోసం స్తంభాలు, విద్యుత్ లైన్ల ఏర్పాట్లు జరిగాయి. కానీ తదుపరి ఎన్నికల కోడ్, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో వసతుల కల్పన ఎక్కడి వేసిన గొంగళి అక్కడే చందంగా తయారైంది. ప్రధాన రహదారితోపాటు అన్ని రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. నిర్మాణ సామగ్రి తరలింపు, వాహనాల రాకపోకలతో గోతులమయంగా మారాయి. రోడ్లు మార్జిన్‌లు, నివాసాల పరిసరాల్లో పిచ్చి మొక్కలు పెరిగిపోయి చిట్టడవిని తలపిస్తున్నాయి. రాత్రిళ్లు ఈ రోడ్ల మీదుగా ఇళ్లకు చేరుకోవాలంటే ఏ పురుగు, విష కీటకాలు బారిన పడాల్సి వస్తుందోనన్న భయంతో ఇక్కడి ప్రజలు భీతిల్లుతున్నారు. ప్రధానంగా తాగునీటి వసతి లేక ఇబ్బంది పడుతున్నారు. ఎవరికీ వారు సొంత బోర్లు వేసుకుని అవసరమైన తాగునీటి, ఇంటి అవసరాలకు నీటిని సమకూర్చుకోవాల్సిన పరిస్థితి. బోర్లు మొరాయించినా, విద్యుత్ సమస్య ఏర్పడినా నీటికి అల్లాడిపోవాల్సిన పరిస్థితి. దీనికి తోడు ఎక్కువగా ఖాళీ స్థలాలు, నిర్జన ప్రదేశాలు ఉండటంతో రాత్రిళ్లు అసాంఘిక కార్యకలాపాలు, జూద శిబిరాలకు ఆవాసంగా మారింది. దీంతో రాత్రిళ్లు ఒంటరిగా బయటకు కూడా రాలేని దుస్థితిలో ఈ ప్రాంత వాసులు ఉన్నారు.

చినుకు పడితే నడవాలన్నా కష్టమే..

చిన్న పాటి వర్షానికే రహదారులు బురదమయంగా మారుతున్నాయి. ప్రధాన రహదారితో పాటు అన్ని రోడ్లలోనూ ఇదే దుస్థితి. దీంతో వర్షాలు పడే సమయంలో ఇళ్లల్లో నుంచి బయటకు రావాలన్నా కష్టంగా ఉంటోందని స్థానికులు వాపోతున్నారు. అతి కష్టం మీద పిల్లలు చదువులకు, పెద్దలకు ఉపాధి నిమిత్తం గడప దాటక తప్పటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వర్షాల సీజన్‌లో వాహనాలు జారిపడి పలువురు గాయపడ్డ ఘటనలు గుర్తు చేసుకుని భయపడుతున్నారంటే సమస్య తీవ్రత అర్థమవుతోంది.

రూ.30 కోట్లతో అంచనాలు..

ఇళ్ల నిర్మాణాలు ఇంకా కొనసాగుతున్నాయి. ఇళ్లు పూర్తయితేనే పంచాయతీకి అప్పగించటం సాధ్యమవుతుంది. రహదారుల అభివృద్ధికి తాజాగా రూ.30 కోట్లతో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించాం. నిధులు మంజూరు కాగానే తగు చర్యలు తీసుకుంటాం. తాగునీటి వసతుల కల్పన జలజీవన్‌మిషన్ కింద జరగాలి. పంచాయతీతో సంప్రదించి ఏ మేరకు చర్యలు చేపట్టగలమో చర్చించి చర్యలు తీసుకుంటాం.

– విజయ్‌బాబు, డీఈ, హౌసింగ్, ఎన్టీఆర్ జిల్లా

పంచాయతీకి అప్పగించలేదు..

వీఎంసీ లే అవుట్‌ను ఇంకా పంచాయతీకి అప్పగించలేదు. అక్కడ ఎలాంటి వసతులు కల్పించాలో కూడా మాకు అంచనా లేదు. ఉన్నతాధికారుల దృష్టిలో సమస్య ఉంది.

– కూర్మారావు, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి, వణుకూరు

వసతులు కల్పించి పంచాయతీకి అప్పగిస్తేనే..



అధ్వానంగా మారిన అంతర్గత రహదారి

కొన్ని నెలలుగా గృహ నిర్మాణశాఖ అధికారులు లేఅవుట్‌కు వచ్చిపోతున్నారే కానీ వీఎంసీ అధికారులు తమ వైపు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రహదారులు, తాగునీటి వసతుల కల్పనపై చర్యలు చేపట్టకపోవటంతో తాము నిత్యం అవస్థలు పడాల్సి వస్తుందంటున్నారు. పేరుకే వీఎంసీ లేఅవుట్ అయినప్పటికీ ఇంటి పన్నుల విధింపు, నీటి వసతుల కల్పన అంతా పంచాయతీ పరిధిలోనే ఉంటుంది. కానీ వీఎంసీ అధికారులు వసతులు కల్పించి పంచాయతీకి అప్పగిస్తేనే పన్నుల విధింపు సజావుగా సాగుతుంది. రానున్న వేసవిలో కనీస వసతుల కల్పన జరిగితే వర్షాకాలంలో ఇక్కట్లు తొలగుతాయి. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులు గృహప్రవేశాలు చేసుకునేందుకు ఆస్కారం ఉంటుంది. వీఎంసీ అధికారులు ఏం చర్యలు తీసుకుంటారో వేచిచూడాలి.

వైఎస్సార్‌సీపీ నేతల హౌస్ అరెస్టులు



జెడ్పీటీసీ సభ్యురాలు ఎలిజబెత్ రాణిని గృహ నిర్బంధం చేసిన పోలీసులు

గన్నవరం: మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీ మోహన్ అరెస్ట్ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నేతలను ముందస్తు అక్రమ గృహ నిర్బంధాలను పోలీసులు చేపట్టారు. స్థానిక రాయ్‌నగర్‌లోని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి ఇంటికి వెళ్లిన పోలీసులు ఆమెను హౌస్ అరెస్ట్ చేశారు. అక్రమ నిర్బంధంపై ఆమె ప్రశ్నించినప్పటికీ పోలీసులు స్పందించలేదు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ రెడ్‌బుక్ రాజ్యాంగంలో భాగంగానే వంశీమోహన్‌పై అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేశారన్నారు. కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న ఈ కూటమి ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెప్పాలని కోరారు. పోలీసుల అధీనంలో ఉన్న వంశీమోహన్‌కు ఎటువంటి హాని జరిగినా ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. వంశీమోహన్ అరెస్ట్ అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు గన్నవరం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని భద్రత చర్యలపై సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉన్నందున ధర్నాలు, ఆందోళనలు చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీచేశారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ తరగతులు ప్రారంభం

గన్నవరం: దావాజీగూడెం జెడ్పీ హైస్కూల్‌లో ఐసీడీఎస్ గన్నవరం ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ బీ, పఢాయి బీ అంశాలపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. శిక్షణ తరగతులను ఐసీడీఎస్ సీడీపీఓ పి. వెంకటలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...సున్నా నుంచి మూడేళ్లలోపు చిన్నారులకు నవచేతన, మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలకు ఆధార్‌శిల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా పిల్లల్లో ఉన్న నైపుణ్యాలను మెరుగుపరచడంపై, మంచి అలవాట్లు నేర్పించడంపై అవగాహన కల్పించాలని తెలిపారు. సూపర్‌వైజర్లు సీహెచ్ నాగపద్మా వతి, సత్యవాణి, నోడల్‌ఆఫీసర్ భానుమతి పాల్గొన్నారు.

చెత్త డంప్ సమస్యకు శాశ్వత పరిష్కారం



సాక్షి వెలుగులోకి తీసుకురాకముందు రామయ్య చెరువు వద్ద చెత్త కుప్పల పరిస్థితి




సాక్షి కథనాలు ప్రచురించడంతో చెత్త గుట్టలు తొలగించి చదును చేసిన వైనం

సాక్షి స్పందన

విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు రామయ్య చెరువు వద్ద చెత్త డంపింగ్ సమస్య 'సాక్షి' చొరవతో పరిష్కారమైంది. చెరువు సమీపంలో చెత్త, వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోవడంతో ఈ ప్రాంతవాసులు పడుతున్న ఇబ్బందులపై 'సాక్షి' వరుస కథనాలు ప్రచురించింది. దీనికి స్పందించిన జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఆర్‌డబ్ల్యూఎస్, డీఆర్‌డీఏ అధికారులు, ఎంపీడీవో విగ్గిన్స్ పంచాయతీ సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో యుద్ధ ప్రాతిపదికన చెరువు సమీపంలోని చెత్త గుట్టలను తొలగించారు. ఆ ప్రాంతాన్నంతా శుభ్రం చేసి చదును చేయించారు. పూడుకు పోయిన డ్రెయిన్‌ను పంచాయతీ నిధులు రూ.25లక్షలతో అభివృద్ధి చేయడానికి అంచనాలు రూపొందించారు. సాక్షి చొరవతో చెత్త సమస్య పరిష్కారమవడంతో గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

–రామవరప్పాడు

క్యాంపస్ డ్రైవ్ లో 34 మంది ఉద్యోగాలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో గురువారం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 34 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. హైదరాబాద్‌కు చెందిన క్రాఫ్ట్ టిక్నో కంపెనీ ఆధ్వర్యంలో విజయవాడ పరిసర ప్రాంతాల్లోని వివిధ కళాశాలలకు చెందిన 135 మంది విద్యార్థులు ఈ క్యాంపస్ డ్రైవ్‌లో పాల్గొన్నారు. క్రాఫ్ట్ టిక్నో కంపెనీ ప్రతినిధులు వివిధ స్థాయిల్లో పరీక్షలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన 34 మంది విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పీఎస్ శ్రీనివాస్ , సెక్రటరీ ఎస్.సత్యనారాయణరెడ్డి ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ జి.వర్ధికాసులు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా గీతాంజలి స్కూల్ సిల్వర్ జూబ్లీ వేడుకలు



హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలో గీతాంజలి హైస్కూల్ సిల్వర్ జూబ్లీ వేడుకలు గురువారం రాత్రి ఘనంగా జరిగాయి. వేడుకలకు డీఈవో పీవీజే రామారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వీరవల్లి లాంటి చిన్న గ్రామంలో 25 ఏళ్లుగా ప్రైవేట్ పాఠశాలను విజయవంతంగా నిర్వహిస్తున్న కరస్పాండెంట్ రామినేని మన్మోహన్ దంపతులను తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

నిష్ణాతులైన మహిళలకు సన్మానం



క్రీడాకారులను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

పామర్రు: జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పద్మశ్రీ ఘంటసాల కళాపీఠం ఆధ్వర్యంలో స్థానిక హితమ్ స్కూల్ ఆవరణలో గురువారం మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాపీఠం అధ్యక్ష కార్యదర్శులు కాటూరి వెంకట మురళీ కృష్ణ, నందిపాటి హేమంత్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుంటున్నారని తెలిపారు. పలు రంగాలలో నిష్ణాతులైన ఏడుగురు మహిళలను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కళాపీఠం సభ్యులు పరిశ వెంకట నాంచారయ్య, అల్లాడి సోమశేఖర్, మహిళలు పాల్గొన్నారు.

గుడివాడ టౌన్: జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళా క్రీడాకారులను గురువారం సత్కరించారు. వెయిట్ లిఫ్టింగ్‌లో పతకాలు సాధించిన టి. ఉష, ఎస్‌పీఎస్ అను, జి. లోహితశ్రీ, పి. అనంత సత్యదుర్గ, జి. సుభాషిణి, గోపికలను సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మహిళలకు పూర్తి సేచ్ఛ ఇచ్చినప్పుడు వారు ఎంతో ఉన్నత స్థితికి చేరుకోగలుగుతారన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కె. రామారావు, కార్యదర్శి డి. శ్రీనివాస్, కోశాధికారి సీహెచ్. రామకృష్ణ, సభ్యులు ఎల్ఈ వెంకటేశ్వరరావు, ఎం. శివరామకృష్ణ, కె. సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ పరికరం అందజేత

ఉయ్యూరు: శిరీష మానసిక దివ్యాంగ పాఠశాలకు లయన్స్ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ప్రతినిధులు గురువారం ఫిజియోథెరపీ పరికరాన్ని వితరణగా అందించారు. విభిన్న ప్రతిభావంతులకు చేయూత ఇవ్వటం కోసం మానవతా దృక్పథంతో పరికరాన్ని అందించినట్లు క్లబ్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నేరెళ్ల తేజ, జోన్ చైర్‌పర్సన్ ఎండీ ఇస్మాయిల్, కార్యదర్శి నెల్లి రాంబాబు, కోశాధికారి దినవహి ప్రసాద్, ఉపాధ్యక్షుడు నల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో పోషణ, విద్యా నాణ్యతలపై అవగాహన

ఉంగుటూరు: అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రీ స్కూల్, నాన్ ఫార్మల్ విద్యా నాణ్యతను మెరుగుపరిచేందుకు అవగాహన తరగతులు నిర్వహిస్తున్నామని స్త్రీ సంక్షేమ శాఖ నోడల్ అధికారి పి.భానుమతి తెలిపారు. తేలప్రోలు జెడ్పీ హైస్కూల్‌లో అంగన్వాడీ కార్యకర్తలకు పోషణ్ బీ, పడాయిబీ శిక్షణా తరగతులు గురువారం నిర్వహించారు. పిల్లలు, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. శిక్షణ తరగతులు ఈ నెల 15వ తేదీ వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. సూపర్‌వైజర్లు బి.పద్మాదేవి, ఎల్.దుర్గాదేవి శిక్షణ తరగతులు నిర్వహించారు.

28లోపు లైవ్ సర్టిఫికెట్లు అందజేయాలి

గన్నవరం: గన్నవరం సబ్ ట్రెజరీ తాలుకా యూనిట్ పరిధిలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్‌దారులు ఈ నెల 28వ తేదీలోపు లైవ్ సర్టిఫికెట్లు అందజేయాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అవుటపల్లి మోహన్‌రావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అనారోగ్యంగా ఉన్న పెన్షన్‌దారులు అడ్రస్ తెలియజేస్తే ఇంటి వద్దే లైవ్ సర్టిఫికెట్లు తీసుకుంటామన్నారు. ఈ అవకాశాన్ని పెన్షన్‌దారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సెంట్రల్ జోన్‌లో ప్రొద్దుటూరు క్రీడాకారుల సత్తా



పతకాలు సాధించిన క్రీడాకారులతో పాఠశాల ఉపాధ్యాయులు

కంకిపాడు: గ్రిగ్ మెమోరియల్ సెంట్రల్ జోన్ ఆటల పోటీల్లో ప్రొద్దుటూరు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు తమ సత్తా చాటారు. క్రీడల్లో రాణించిన క్రీడాకారులను పాఠశాల హెచ్ఎం ఎం.అరుణకుమారి గురువారం ప్రత్యేకంగా అభినందించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 11, 12 తేదీల్లో 84వ గ్రిగ్ మెమోరియల్ సెంట్రల్ జోన్ ఆటల పోటీలు అవనిగడ్డ ప్రభుత్వ పాఠశాలలో జరిగాయని, ఈ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు సీనియర్స్ బాలికల విభాగంలో వాలీబాల్‌లో విన్నర్స్‌గానూ, షటిల్‌లో రన్నర్స్‌గానూ నిలిచారన్నారు. ప్రతిభ చాటిన కె.మైనశ్రీ, ఎం.జ్ఞానేశ్వరి, పి.వాగ్దేవి, ఎ.వైష్ణవి, కె.జయశ్రీ, కె.శైలజ, కె.మౌనిక, పి.యోగశ్రీ,శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు వీరంకి రమేష్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ పి.నాగమణి, కో ఆప్టెడ్ సభ్యుడు వై.బుల్లియ్య పాల్గొన్నారు.

ఇతర ప్రాంతాల చికెన్ విక్రయం నిషేధం

పెనమలూరు: ఇతర ప్రాంతాల నుంచి తీసుకు వచ్చిన కోళ్లు, చికెన్, కోడిగుడ్లు తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో విక్రయించరాదని తాడిగడప మున్సిపల్ కమిషనర్ భవానీప్రసాద్ తెలిపారు. ఆయన గురువారం వివరాలు తెలుపుతూ తెలంగాణ, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో బర్డ్ ఫ్లూ ఉన్నందున ఇతర ప్రాంతాలను చెందిన కోళ్లు, కోడి గుడ్లు తాడిగడప పరిధిలో విక్రయించరాదన్నారు. ఈ విషయంలో పౌల్ట్రీ వ్యాపారులు, చికెన్ షాపు నిర్వాహకులు కచ్చితంగా నిబంధనలు పాటించాలని, లేని పక్షంలో ప్రజారోగ్య చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఏలియా సస్పెన్షన్

గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారు వెంకట నరసింహాపురం కాలనీ ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పాము ఏలియాను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

వివరాలిలా వున్నాయి. చెక్ బౌన్స్ కేసులో పాము ఏలియాను గత నెల 28న నెల్లూరు మొబైల్ కోర్టు రిమాండ్‌కు అదేశించింది. దీంతో పోలీసులు ఆయన్ను రిమాండ్‌కు తరలించగా ఈ నెల 6వ తేదీ వరకు జైలులో ఉన్నారు. దీంతో క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఏలియాను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి జేవీ రామారావు ఉత్తర్వులు ఇచ్చారు. జనవరి 28 నుంచి ఆయన సస్పెన్షన్ కొనసాగుతుందని ఉత్తర్వులో పేర్కొన్నారు.

కానూరులో డిగ్రీ విద్యార్థిని అదృశ్యం

పెనమలూరు: కానూరులో డిగ్రీ చదువుతున్న విద్యార్థిని అదృశ్యమైన ఘటనపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం కానూరు తులసీనగర్ రెండవ లైన్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె విజయవాడలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. ఆమె ఈ నెల 12వ తేదీన ఇంటి నుంచి అదృశ్యమయింది. తాను వెళ్లి పోతున్నానని ఫోన్ మెసేజ్ పెట్టింది. ఆమె కోసం కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

దాడి ఘటనపై కేసు నమోదు

కంకిపాడు: దాడి ఘటనపై స్థానిక పోలీసు స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు... మండలంలోని పునాదిపాడు గ్రామానికి చెందిన తిరుమలకొండ వెంకటేశ్వరరావు ఆటో డ్రైవరుగా జీవిస్తుంటాడు. సమీప బంధువైన నాగ వేణుతో ఈనెల 12న పునాదిపాడు బీసీ కాలనీ వద్ద ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో నాగవేణు తన జేబులో ఉన్న బైక్ కీతో వెంకటేశ్వరరావుపై దాడి చేసి గాయపరిచాడు. బాధితుడు వెంకటేశ్వరరావు ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

గన్నవరం: స్థానిక శ్రీమల్లికార్జున హైస్కూల్ ప్రాంగణంలో ఈ నెల 15వ తేదీన ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు హెచ్ఎం ఎస్.మాధవీలత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో గుండె, మెదడు, నరాలు, జీర్ణకోశ, శ్వాసకోశ, ఎముకలు, కీళ్లు, స్త్రీ, ప్రసూతి, దంత సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈసీజీ, స్కానింగ్, రక్తపరీక్షలు కూడా నిర్వహిస్తారన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగే ఈ వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రోగులు ముందుగా 81870 34999, 90521 91190 వాట్సాప్ నంబర్ల ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

కానూరులో వ్యక్తి అదృశ్యం

పెనమలూరు: కానూరులో ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటనపై పోలీసులు గురువారం కేసు నమోదుచేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానూరు మహదేవపురం కాలనీకి చెందిన బి.జోజిబాబు గత నెల 22న ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. ఆచూకీ తెలిసిన వారు వెంటనే 93904 88364 నంబరుకు ఫోన్ చేయాలని ఎస్ఐ రాజేష్ తెలిపారు.